



గిరి ప్రదక్షిణను ప్రారంభిస్తున్న ఆలయ అనువంశిక ధర్మకర్త, మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు

భక్త జనసంద్రం

సింహగిరి ప్రదక్షిణకు లక్షలాది మంది రాక

పోటెత్తిన సింహాచలం

- ఉత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించిన దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- భక్తులకు స్వచ్ఛంద సంస్థల సేవలు

విశాఖపట్నం, సింహాచలం, జూలై 20 (ఆంధ్రజ్యోతి):

ఓం నమో నారసింహ. పాహిమాం...పాహిమాం...పాహి గోవిందా...గోవింద!!. అంటూ భక్తుల నామస్మరణతో శనివారం సింహగిరి పులకించిపోయింది. గిరి ప్రదక్షిణకు తరలివచ్చిన భక్తజనంతో సింహాచలం, అడవివరం ప్రాంతం జనసంద్రమైంది. ఉదయం వేలల్లో మొదలైన భక్తుల సంఖ్య సాయంత్రానికి లక్షలకు చేరుకుంది. ప్రదక్షిణ మార్గం జన ప్రవాహంతో కిక్కిరిసింది. అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించిపోయింది.

వరాహ లక్ష్మీనృసింహస్వామి కొలువుదీరిన సింహగిరి చుట్టూ శనివారం లక్షలాది మంది భక్తులు ప్రదక్షిణలు చేశారు. జిల్లా కలెక్టర్, దేవదాయ శాఖ అధికారులు నిర్ణయించిన సమయం కంటే ముందుగానే వేలాది మంది భక్తులు శనివారం ఉదయం ఎనిమిది గంటలకే సింహాచలం తొలిపావంచావద్దకు చేరుకుని కొబ్బరికాయలు కొట్టి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు.



సింహగిరి ప్రదక్షిణలో భాగంగా పూలరథంను అనుసరిస్తున్న భక్త జనం



సింహాచలం తొలిపావంచా వద్ద పూజలు చేస్తున్న భక్తులు

దేవస్థానం అనువంశిక ధర్మకర్త, మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు అధికారులు నిర్ణయిం చిన సమయానికి అంటే సాయంత్రం నాలుగు గంటలకు కొండదిగువన తొలిపావంచా వద్దకు చేరుకున్నారు. పుష్పతేరులోని స్వామివారికి అర్చక స్వాములు పూజలు చేసి అశోక్ గజపతిరాజుకు తీర్థ ప్రసాదాలను ఇచ్చారు. అనంతరం ఆస్థాన విద్వాంసుల నాదస్వరాలాపనలు, పండితుల వేదమంత్రోచ్చారణలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ దేవస్థానం కార్యనిర్వాహణాధికారి సింగాల శ్రీనివాసమూర్తితో కలిసి జెండాను ఊపి సింహగిరి ప్రదక్షిణకు అశోక్‌గజపతిరాజు లాంఛనంగా శ్రీకారం చుట్టారు. తేరుకు ముందుభాగాన దేవస్థానం అధికారులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

సింహాచలం తొలి పావంచా వద్ద ప్రారంభమైన పుష్పతేరు (పూల రథం) పాత అడివివరం, హనుమంతువాక, జాతీయ రహదారి నుంచి మద్దిలపాలెం, గురుద్వారా, మురళీనగర్ కూడలి, ఎన్ఏడీ, గోపాలపట్నం బంక్, ప్రహ్లాదపురం మీదుగా తిరిగి సింహాచలం తొలిపావంచాకు చేరుకుంది. పూలరథాన్ని లక్షలాది మంది భక్తులు అనుసరించారు. ఉత్సవంలో పాల్గొనేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి మాత్రమే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాదిమంది భక్తులు తరలివచ్చారు. ముందుగా రూపొందించి ప్రణాళికల ప్రకారం దేవస్థానం అధికారులు తొలిపావంచా వద్ద ఏర్పాటుచేసిన 80 ఇనుప గడ్డర్లపై భక్తులు లక్షల సంఖ్యలో కొబ్బరికాయలను కొట్టారు. వాటిని పోగుచేసుకునేందుకు కాంట్రాక్టర్ ప్రత్యేక వాహనాలను, పనివార్లను వినియోగించారు. కొంతమంది భక్తులు సింహగిరి ప్రదక్షిణను ముగించుకుని పలువురు భక్తులు రాత్రి తొమ్మిది గంటలకే తిరిగి తొలిపావంచాకు చేరుకున్నారు.

భక్తులకు స్వచ్ఛంద సంస్థల సేవలు

తొలి పావంచా మొదలుకొని పాత అడివివరం, హనుమంతువాక, హెచ్‌బీ కాలనీ మీదుగా గోపాలపట్నం వరకూ భక్తులు నడిచే మార్గాల్లో సేవాసంస్థలు శిబిరాలు ఏర్పాటు చేసి అల్పాహారం, మజ్జిగ, బాదంపాలు, టీ, కాఫీలు, తాగునీరు సరఫరా చేశాయి. అలసిపోయిన భక్తుల కాళ్లకు సత్యసాయి సేవా సంస్థల సిబ్బంది సుమారుగా వంద మంది ప్రత్యేకంగా తయారుచేసిన నూనెతో మర్దనా చేసి సాంత్వన చేకూర్చారు. మానవ సేవే..మాధవ సేవ అనే మాటలను పూర్తిగా విశ్వసించి భక్తులకు సేవలు అందించారు.

ఎంతో పున్నెమొత్తాది



సిమ్మాద్రప్పన్న మయిమగలోడు. కోరిన కోరికలు తీరుత్తాడు. గిరి పెదచ్చన చేత్తే ఎంతో పున్నె మొత్తాది. ఆరేళ్ల నించి కెమం తప్పకన్న వత్తన్నాను. పెదచ్చన తరవాత సామిని దర్శనం చేసుకున్న తరవాత ఎంతో గొప్ప ఆనందమేత్తాది. సామిని మనసుపూర్తిగా కొలిత్తే కట్టాలన్నీ తీరుత్తాడు. బత్తితో నడిచేత్తే ఏమీ తెలీదు. చిన్నా, పెద్దా అంతా ఉసారుగా నడిచేత్తన్నారు. ఒంట్లో ఓపికున్నంత కాలమూ వత్తాను. మా చుట్టాలు, మేము కలిసి వచ్చినాము. పెతేడాది మా ఊరు నుంచి వత్తున్న భత్తులు ఎక్కువైనారు. పిల్లకాయలు కూడా ఎక్కువ మందే వచ్చినారు.

- జట్టి దేముళ్లు, పార్వతీపురం

చోడవరం, మాడుగుల ప్రాంతంలో పారిశ్రామిక క్లస్టర్

5 వేల ఎకరాల్లో పరిశ్రమలు ఏర్పాటు

- ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో చర్చలు
- బీపీసీఎల్ కోసం ప్రయత్నిస్తున్నా..
- యువతకు ఉపాధి కల్పనకు కట్టుబడి ఉన్నాం
- అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్



మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేశ్, తదితరులు

అనకాపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి):
ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు యువత, నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించే లక్ష్యంతో చోడవరం, మాడుగుల పరిసరాల్లో పారిశ్రామిక క్లస్టర్‌ను ఏర్పాటు చేయనున్నట్టు అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ప్రకటించారు. ఇందుకోసం ఐదు వేల ఎకరాలను సేకరించనున్నట్టు చెప్పారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భూసేకరణ విషయంలో త్వరలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోం శాఖ మంత్రి అనిత, ఎమ్మెల్యేలతో చర్చిస్తామన్నారు. దేశంలో ప్రముఖ కంపెనీలను జిల్లాకు తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఐటీ రంగం అభివృద్ధితోపాటు సిమెంట్ కంపెనీలు, హైడ్రోజన్ ప్లాంట్‌లను ఏర్పాటుకు చర్చలు జరుగుతున్నామన్నారు. ఇప్పటికే అదాని, జిందాల్, బిర్లా, రిలియన్స్ వంటి ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో చర్చించినట్టు సీఎం రమేశ్ వెల్లడించారు. నక్కపల్లిలో ఎస్ఈజెడ్‌కు జాతీయ రహదారి నుంచి కనెక్టవిటీ రహదారి నిర్మాణ పనులు చేపట్టి అక్కడ కూడా పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. బీపీసీఎల్ ఏపీ పెట్రో కెమికల్ కంపెనీని ఎలమంచిలి, పాయకరావుపేట తీర ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. దీనికి సముద్ర తీర ప్రాంతాల్లో కనీసం 5 వేల నుంచి 6 వేల ఎకరాలు భూమి అవసరమని అంటున్నారని, ఎలమంచిలి, అనకాపల్లి, పాయకరావుపేట పరిసరాల్లో భూసేకరణకు కలెక్టరుతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అనకాపల్లి నుంచి రాజమండ్రి వరకు ఆరు లేన్ల జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపట్టనున్నట్టు సీఎం రమేశ్ తెలిపారు. అవసరం మేరకు అన్నిచోట్ల అండర్ పాస్‌లు, ఓవర్ పాస్‌ల నిర్మాణానికి కేంద్ర మంత్రి గడ్కరీ అంగీకరించారన్నారు. త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు చేపడతామన్నారు. అనకాపల్లి నుంచి లంకెలపాలెం మీదుగా వెళ్లే జాతీయ రహదారిని అభివృద్ధి చేస్తామన్నారు. అనకాపల్లి నుంచి భీమిలి, భోగాపురం వరకు మెట్రోతో పాటు ఫ్లైఓవర్‌ల నిర్మాణాలకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించామన్నారు. సబ్బవరం నుంచి షీలానగర్ రోడ్డు పనులకు నిధులు మంజూరయ్యాయన్నారు. అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు పనులతో పాటు లంకెలపాలెం నుంచి సబ్బవరం వరకు రోడ్డు పనులు కూడా పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో రూ.800 కోట్లతో ఏలేరు ఎడమ కాలువ పనులు పూర్తిచేసి, సాగు, తాగునీరు అందించాలని సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయించారన్నారు. జిల్లాలో మూతపడిన షుగర్ ఫ్యాక్టరీలను ఇథనాల్ ఫ్యాక్టరీలుగా మార్చేందుకు రైతులు, స్థానిక నాయకులతో ... మిగతా 8వ పేజీలో

పొంగుతున్న నదులు, వాగులు

జిల్లాలో విస్తారంగా వర్షాలు

- తాచేరు డైవర్షన్ రోడ్డుపై నుంచి వరద నీరు ప్రవాహం
- బీఎన్ రోడ్డులో నిలిచిన రాకపోకలు
- అప్రమత్తమైన అధికారులు
- ఉధృతంగా ప్రవహిస్తున్న మేజర్, మైనర్ శారదా నదులు
- పరుగులు తీస్తున్న సర్పా, వరాహా నదులు



కోటవురట్ల: పందూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరహా నది



వడ్డాది కస్పా గ్రోయిన్‌పై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు.

బుచ్చెయ్యపేట/రావికమతం/మాడుగుల రూరల్/ నర్సీపట్నం/ రాంబిల్లి/కోటవురట్ల/ఎస్.రాయవరం, జూలై 20:
బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నదులు, గెడ్డలు, కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు కురిసిన వర్షానికి బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో పెద్దేరు, విజయరామరాజుపేటలో తాచేరు, బొడ్డేరు నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.విజయరామరాజుపేట వద్ద తాచేరు నదిపై నిర్మించిన డైవర్షన్ రోడ్డు పైనుంచి వరద నీరు ప్రవహించడంతో భీమునిపట్నం-నర్సీపట్నం(బీఎన్) రోడ్డులో రాకపోకలు నిలిచిపోయాయి. చోడవరం నుంచి పాడేరుకు వయా గౌరీపట్నం, లేదా వరహాపురం, మాడుగుల మీదుగా రాకపోకలు మళ్లించారు. నర్సీపట్నం, పాడేరు నుంచి విశాఖ, అనకాపల్లి రవాణాను వడ్డాది మీదుగా కొంకోట-బంగారుమెట్ట (కెబి) రోడ్డుకు మళ్లించారు. పెద్దేరు రిజర్వాయర్ గేట్లు ఎత్తివేయడంతో వడ్డాది కస్పా గ్రోయిన్ మీదుగా వరద నీరు పొటెత్తింది. అలాగే బీఎన్ రోడ్డులో వడ్డాది కాజ్‌వేను తాకుతూ వరద నీరు ప్రవాహిస్తున్నది. వరద ప్రవాహానికి దెబ్బతిన్న తాచేరు డైవర్షన్ రోడ్డును డీపీఓ శిరీషారాణి, ఎంపీడీఓ వెంకటాచార్యులు, తహసీల్దార్ శ్రీకాంత్, సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ డి.ఈశ్వరరావు, ఆర్అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. భారీ వర్షాలకు బీఎన్ రోడ్డు మరింతగా ఛిద్రంగా మారింది. ఈ రోడ్డులో గోతులు మడుగులను తలపిస్తున్నాయి.

రెండో రోజూ కల్యాణపులోవ గేట్లు ఎత్తివేత

రావికమతం మండలంలోని కల్యాణపులోవ జలాశయానికి రెండో రోజూ వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో రిజర్వాయర్‌లో నీటి మట్టం ప్రమాద స్థాయికి చేరకుండా శుక్రవారం సాయంత్రం ఎత్తిన రెండు గేట్లు క్లోజ్ చేయకుండా శనివారం కూడా సర్పానదిలోకి నీటిని విడిచిపెడుతున్నామని ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణదొర తెలిపారు. రిజర్వాయర్ ఎగువకొండల్లో విస్తారంగా కురిసిన వర్షాలకు ఇన్‌ఫ్లో 150 క్యూసెక్కులు వస్తున్నది. రిజర్వాయర్ సామర్థ్యం 460 అడుగులు కాగా ప్రస్తుతం 458.8 అడుగులకు నీటి మట్టం పెరిగింది. దీంతో రెండు గేట్లు ఎత్తి 120 క్యూసెక్కుల నీటిని సర్పానదిలోకి విడిచిపెడుతున్నారు.

ప్రమాద స్థాయికి పెద్దేరు జలాశయం

మాడుగుల మండలంలోని రావిపాలెం పెద్దేరు జలాశయం నీటి మట్టం ప్రమాద స్థాయికి చేరింది. రిజర్వాయర్ గరిష్ఠ నీటి మట్టం 137 మీటర్లు కాగా, శనివారం 127 క్యూసెక్కులు ఇన్‌ఫ్లోతో 136.20 మీటర్లకు చేరింది. పెరిగిన నీటిమట్టం అనుసరించి నీటిని విడుదల చేస్తామని ఏఈఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

గరిష్ఠ స్థాయికి రావణాపల్లి నీటిమట్టం

నర్సీపట్నంలో రావణాపల్లి రిజర్వాయర్ నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరుకుంది. గత రెండు రోజులుగా పడుతున్న వర్షాలకు ఆవ జలకళ ఉట్టి పడుతోంది. రిజర్వాయర్ పూర్తి నిల్వ సామర్థ్యం 132.810 ఎంసీఎఫ్‌టీలు. ప్రస్తుత నీటి మట్టం 358.7 అడుగులు ఉంది. పొర్లుకట్టు నుంచి 5 అంగుళాలు మేర 83.237 క్యూసెక్కుల నీరు దిగువకు పారుతోంది.



రాంబిల్లి: నారాయణపురం వద్ద నిండుగా ప్రవహిస్తున్న మైనర్ శారదా నది

పరవళ్లు తొక్కుతున్న మేజర్, మైనర్ శారదా నదులు

రాంబిల్లి మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రధాన మేజర్, మైనర్ శారదా నదులు పరవళ్లు తొక్కుతున్నాయి. ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురవడంతో కొత్తూరు వద్ద మేజర్ శారదా నది, నారాయణపురం వద్ద మైనర్ శారదా నదులు నిండుగా ప్రవహిస్తున్నాయి. దీంతో ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. నదుల్లో నీటి ప్రవాహం ఉండడంతో ఖరీఫ్ వరి నాట్లుకు ఇబ్బందులు ఉండవని రైతులు చెబుతున్నారు.

ఉధృతంగా సర్పానది

కోటవురట్ల మండలంలో సర్పా, వరహా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరహా నది ఉధృతికి పందూరు, ముడలలోవ, బంద గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలో దుగ్గాడ కాలువ ఉధృతంగా ప్రవహించడంతో యండపల్లి, లింగాపు రం, జల్లూరుల్లో వేసిన వరి నారు, నువ్వు చేను, కూరగాయల పంటలు నీట మునిగాయి.

పరుగులు తీస్తున్న వరహానది

ఎస్.రాయవరం మండలంలో వరహా నదిలో ఉరకలు వేస్తోంది. ధర్మవరం అగ్రహారం వద్ద గ్రోయిన్ పైనుంచి వరహా నది ఉధృతంగా పారుతోంది. వరి నారుమడుల్లోకి నీరు చేరుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

జీవీఎంసీ కమిషనర్‌గా సంపత్‌కుమార్



పి.సంపత్‌కుమార్

విశాఖపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కమిషనర్‌గా పి.సంపత్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. జీవీఎంసీ కమిషనర్‌గా పనిచేసిన సాయికాంత్‌వర్మకు ఇటీవల టిడ్కో ఎండీగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆ పోస్టులో ఇప్పటివరకూ ఎవరినీ నియమించలేదు. ఇన్‌చార్జి కమిషనర్‌గా జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌కు బాధ్యతలు అప్పగించారు. అయితే శనివారం రాష్ట్రవ్యాపంగా 61 మంది ఐఏఎస్‌లను బదిలీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఎన్.టి.ఆర్.జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న పి.సంపత్‌కుమార్‌ను జీవీఎంసీ కమిషనర్‌గా నియమించింది. 2016 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సంపత్‌కుమార్ గతంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీగా, మాజీ హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప ఓఎస్‌డీగా పనిచేశారు.

జలాశయాలు కళ కళ! - 7లో

తహసీల్దార్ల బదిలీలకు రంగం సిద్ధం!

- జిల్లాకు 24 మందిని కేటాయించిన ప్రభుత్వం

అనకాపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ముందు జిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీ అయిన 24 మంది తహసీల్దార్‌లను మళ్లీ జిల్లాకు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మూడు నెలల క్రితం జిల్లాలో పనిచేస్తున్న 24 మంది తహసీల్దార్లను శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు బదిలీ చేసిన సంగతి తెలిసిందే. వీరంతా ఎన్నికల అనంతరం తిరిగి సొంత జిల్లాలకు వచ్చేందుకు ఎప్పటి నుంచో ఎదురు చేస్తున్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం తహసీల్దార్ల బదిలీల ప్రక్రియ చేపట్టేందుకు నిర్ణయం తీసుకోవడంతో వీరి నియామకాలకు మార్గం సుగమం అయ్యింది. ఒకటి రెండు రోజుల్లో కలెక్టర్ విజయ్‌కృష్ణన్ 24 మంది తహసీల్దార్లకు మండలాలు కేటాయిస్తూ బదిలీ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. పలువురు తహసీల్దార్లు తమకు కావాల్సిన చోట పోస్టింగ్‌లు వేయించుకునేందుకు స్థానిక ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు తీసుకున్నట్టు సమాచారం.

జనసిరితో మురిసిన సింహగిరి

భూ ప్రదక్షిణతో సమాన ఫలితాన్ని ఇచ్చే సింహ'గిరి' ప్రదక్షిణ శనివారం అంగరంగ వైభవంగా సాగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా లక్షలాది మంది భక్తులు ఉదయం ఏడు గంటల నుంచే గిరి ప్రదక్షిణకు శ్రీకారం చుట్టారు. ముందుగా కొండదిగువ తొలి పావంచా వద్ద సింహాద్రి అప్పన్న స్వామికి నమస్కరిస్తూ కొబ్బరికాయలు కొట్టి 32 కిలో మీటర్ల గిరి ప్రదక్షిణను కాలినడక ప్రారంభించారు. పోటెత్తిన భక్తజనంతో సింహగిరి కిక్కిరిసిపోయింది.





పుష్పరథంలోని స్వామివారికి హారతిస్తున్న కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు



పుష్పరథం వద్ద కుటుంబ సభ్యులతో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు



కాళికాదేవి వేషధారణతో కళాకారుల ప్రదర్శన



వడివడిగా అడుగులు వేస్తూ..



సింహాచలంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హరింధర్ ప్రసాద్



జన సమూహంలో తప్పిపోకుండా ఇలా..



కుమార్తెను భుజంపై ఎత్తుకుని పాదయాత్ర



తొలిపావంచా వద్ద కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు



భక్తులకు పాలు పంపిణీ చేస్తున్న తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

అప్పన్న మహిమాన్వితుడు



నమ్మి కొలిచే భక్తులకు సకల శుభాలను కలుగచేసే మహిమాన్వితుడు సింహాచలం అప్పన్నస్వామి. కుటుంబ సభ్యులమంతా సుఖ సంతోషాలతో జీవించాలన్న కాంక్షతో ఇరుగుపొరుగు వారి సూచనల మేరకు తొలిసారి గిరి ప్రదక్షిణకు వచ్చాను.

- కె.భారతి, గృహిణి, పార్వతీపురం

చిన్నతనం నుంచి అలవాటు



నా చిన్నతనం నుంచి గిరి ప్రదక్షిణకు రావడం అలవాటు. మా తల్లిదండ్రుల నుంచి నాకు ఇది అలవాటుగా మారింది. ఎటువంటి కోర్కెలు లేకుండా ఏటా గిరి ప్రదక్షిణ చేస్తున్నాను. ఇప్పటి వరకు 19 సార్లు రాగా, ఇది 20వ సారి.

- ఆర్.శైలజ, ప్రైవేటు ఉద్యోగిని, ఖుర్దా రోడ్డు

మంచి ఉద్యోగం రావాలని...



నేను బీటెక్ పూర్తి చేశాను. మా ప్రాంతానికి చెందిన కొందరు భక్తులు అప్పన్న గిరి ప్రదక్షిణ చేస్తే మంచి ఉద్యోగం వస్తుందని చెప్పారు. వారి సూచన మేరకు ప్రదక్షిణలో పాల్గొన్నాను. స్వామివారి దయ వల్ల త్వరలోనే నాకు మంచి ఉద్యోగం వస్తుందని ఆశిస్తున్నాను.

- సురేష్, నిరుద్యోగి, అన్నవరం, కాకినాడ జిల్లా

చూడాలన్న ఆసక్తితో వచ్చాను



నాకు యూట్యూబ్ చూడడం ఎక్కువ అలవాటు. ఇటీవల సింహగిరి ప్రదక్షిణ వీడియో చూశాను. మనసులో కోరిక కలిగి వ్యయప్రయాసాలు ఓర్చి ఉత్సవంలో పాల్గొంటున్నాను. ఇంతమంది భక్తులు ఉంటారని ఊహించలేదు. భక్తులందరితో కలిసి గిరి ప్రదక్షిణ చేయడం కొత్త అనుభూతి.

- రేగం శ్రీవల్లి, గృహిణి, విజయనగరం.

మా ఇంటి ఇలవేల్పు



అప్పన్నస్వామి మా ఇంటి ఇలవేల్పు. స్వామిపై భక్తితో గిరిప్రదక్షిణ చేయాలనుకుని నాలుగేళ్ల నుంచి ప్రయత్నిస్తూనే ఉన్నాను. ఇన్నాళ్లకు స్వామి దయ కలగడంతో ఉత్సవంలో పాల్గొనడానికి అవకాశం చిక్కింది. కుటుంబ సభ్యులంతా సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నాను.

- సీహెచ్ సంఘం, క్షురకుడు, చీపురుపల్లి

స్నేహితుల సూచనలతో వచ్చా..



బీటెక్ పాసై హార్డ్ వేర్ ఉద్యోగం చేస్తున్నాను. అప్పన్నస్వామి దయతో నేను పనిచేస్తున్న ఇదే రంగంలో మరింతగా అభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో గిరి ప్రదక్షిణలో పాల్గొన్నాను. నాతో పాటు చాలామంది స్నేహితులు కూడా వచ్చారు.

- ఆర్. కిరణ్, హార్డ్‌వేర్ ఉద్యోగి, కూర్మన్నపాలెం

క్రైం... crime news

అత్తింటి వేధింపులకు మహిళ ఆత్మహత్య

బుచ్చెయ్యపేట, జూలై 20: చోడవరంలో చికిత్స పొందుతూ వడ్డాదికి చెందిన వివాహిత మృతి చెందినట్టు ఎస్‌ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. ఈ నెల 18న అత్త మందలించడంతో మనస్తాపానికి గురైన పరిమిల భవానీ (21) క్షణికావేశంతో ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో భవానీని కుటుంబ సభ్యులు చోడవరం ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ భవానీ మృతి చెందింది. బాధితురాలి తల్లి పెదపూడి లక్ష్మి చేసిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ ఈశ్వరరావు తెలిపారు.

తండ్రీకొడుకుల దాడితో ఒకరికి తీవ్ర గాయాలు

రావికమతం, జూలై 20: వ్యక్తిగత కక్షల నేపథ్యంలో తండ్రీకుమారుడు దాడి చేయడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాల య్యాయి. ఇందుకు సంబంధించి కొత్తకోట ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తకోట గ్రామానికి చెందిన బాధితుడు వీరవెల్లి గణేష్‌కు అదే గ్రామానికి చెందిన వెల్లంకి త్రిమూర్తుల మధ్య పాత కక్షలు ఉన్నాయి. శనివారం వీరిద్దరూ స్థానిక వెల్లంకి వారి దేవాలయం వద్ద గొడవ పడ్డారు. ఈ క్రమంలో గణేష్‌పై త్రిమూర్తులు ఇనుపరాడ్డుతో దాడి చేసి తలపై గాయపరిచాడు. అనంతరం త్రిమూర్తులు కుమారుడు కూడా వచ్చి దాడి చేయడంతో గణేష్ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా విశ్వనాథన్

విశాఖపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న కె.విశ్వనాథన్‌ను వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా నియమిస్తూ శనివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన విశ్వనాథన్‌ను గత వైసీపీ ప్రభుత్వం జీవీఎంసీ అడిషనల్ కమిషనర్‌గా నియమించింది. ఇదిలావుండగా వీఎంఆర్‌డీఏ కమిషనర్ పోస్టు గత రెండేళ్లుగా ఖాళీగా ఉంది. అప్పటి కలెక్టర్ ఎ.మల్లికార్జునకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన వెళ్లిపోయిన తరువాత జాయింట్ కమిషనర్‌గా ఉన్న రవీంద్రకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పుడు విశ్వనాథన్‌ను పూర్తిస్థాయిలో కమిషనర్‌గా నియమించారు.

కిరండోల్ రైళ్ల గమ్యాల కుదింపు, దారి మళ్లింపు

విశాఖపట్నం, జూలై 20: భారీ వర్షాలు కురుస్తున్నందున విశాఖ, కిరండోల్ మధ్య నడుస్తున్న రైళ్ల గమ్యాలను కుదించడంతోపాటు మళ్లింపు మార్గంలో నడిపించనున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. విశాఖ నుంచి కిరండోల్ వెళ్లే పాసింజర్ రైలు (08551) ఈనెల 20 నుంచి 22 వరకు విశాఖ నుంచి దంతెవాడ వరకు, తిరుగు ప్రయాణంలోని కిరండోల్ నుంచి విశాఖ రావాల్సిన పాసింజర్ రైలు ఈనెల 21 నుంచి 23 వరకు దంతెవాడ నుంచి విశాఖకు నడుస్తుందని పేర్కొన్నారు. దంతెవాడ, కిరండోల్ మధ్య రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేసినట్టు చెప్పారు. ఇక, విశాఖ-కిరండోల్ నైట్ ఎక్స్‌ప్రెస్ రైలు (18514) ఈనెల 20 నుంచి 22 వరకు వయా విజయనగరం, రాయగడ, కోరాపుట్ మీదుగా వెళ్తుందన్నారు. తిరిగి కిరండోల్-విశాఖ నైట్ ఎక్స్‌ప్రెస్ (18513) రైలు ఈనెల 21 నుంచి 23 వరకు వయా కోరాపుట్, రాయగడ, విజయనగరం మీదుగా నడపనున్నట్టు పేర్కొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

జలాశయాలు కళ కళ!

- ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు
- పెద్దేరు నుంచి 219 క్యూసెక్కులు విడుదల
- గరిష్ట నీటి మట్టాలకు చేరువలో రిజర్వాయర్లు
- ఖరీఫ్ సాగుకు తీరనున్న నీటి కష్టాలు



రావికమతం మండలం కళ్యాణపులోవ జలాశయం



ఎస్.రాయవరం మండలం ధర్మవరం అగ్రహారం వద్ద వరహా నది ఉరకలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో సాగునీరు అందించే జలాశయాలకు వరద నీరు వచ్చి చేరుతోంది. శుక్రవారం రాత్రి కురిసిన వర్షాలతో జలాశయాలకు జలకళ సంతరించుకుంటోంది. రిజర్వాయర్ల ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో ఖరీఫ్‌కు సాగునీటి కష్టాలు తీరనున్నాయి. ఎగువ ప్రాంతాలతో పాటు జిల్లాలో గడిచిన మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో జలాశయాల్లోకి భారీగా నీరు చేరుతోందని జల వనరుల శాఖాధికారులు తెలిపారు. వారం రోజుల క్రితం వరకు జిల్లాలో వరుణుడు ముఖం చాటేయడంతో ఈ ఏడాది ఖరీఫ్ సాగు కష్టమేనని అన్నదాతలు ఆందోళన చెందారు. కనీసం వరి నారుమడుల తయారీ కోసమైనా వర్షాలు పడాలని ఆకాశం వైపు ఆశతో చూశారు. అల్పపీడన ప్రభావంతో గడిచిన రెండు, మూడు రోజులుగా జిల్లా అంతటా వర్షాలు కురిశాయి. అలాగే ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో జలాశయాలకు వరద పోటెత్తుతోంది. ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు ఆయకట్టుకు విడుదల చేయాల్సిన నీటి నిల్వలతో జలాశయాలు కళకళలాడుతున్నాయి. తాండవ, రైవాడ జలాశయాలకు గతేడాదితో పోల్చి చూస్తే- తక్కువ నీటి మట్టం ఉంది. వరహా స్పిల్‌వే నుంచి 100, పెద్దేరు జలాశయం ఉంచి 219 క్యూసెక్కుల నీటిని శనివారం ఉదయం విడుదల చేశారు. శుక్రవారం రాత్రి తాండవ 57 మి.మీ, రైవాడ 56మి.మీ, కోనాం 35మి.మీ, వరహా 18మి.మీ, పెద్దేరు 60 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఆశాజనకంగా నీటిమట్టాలు

రిజర్వాయర్ల ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో తాండవ జలాశయానికి 1,273, రైవాడ 810, కోనాం 120, వరహా 100, పెద్దేరుకు 94 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. తాండవ గరిష్ఠ నీటి మట్టం 380 అడుగులు కాగా శనివారం నాటికి 365.40 అడుగులకు చేరింది. రైవాడలో 114 మీటర్లకు 106.65 మీటర్లు, కోనాంలో 101.25 మీటర్లకు 98.45 మీటర్లు, రావికమతం మండలం కల్యాణపులోవ జలాశయానికి శనివారం నాటికి 458.8 అడుగుల నీటి మట్టం చేరింది. మాడుగుల మండలంలో పెద్దేరులో 137 మీటర్లకు 136.2 మీటర్ల ఎత్తుకు నీరు చేరింది. శనివారం 219 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇంకా వరద ప్రభావం ఎక్కువైతే ఆదివారం రెండు గేట్లు ఎత్తేసి సర్పా నదిలోకి నీరు విడుదల చేయనున్నారు. ఎగువ ప్రాంతాల్లో మరో రెండు రోజులు వర్షాలు ఇదేవిధంగా కురిస్తే జలాశయాలు నిండిపోయి, గేట్లు ఎత్తేసే పరిస్థితి ఉంటుందని జల వనరుల శాఖ అధికారులు అంటున్నారు. గత మూడు రోజులుగా కురిసిన వర్షాలు రైతులకు ఉపశమనం కలిగించింది. ఖరీఫ్ వరి సాగుకు నారు మడులు సిద్ధం చేసుకొనే పనిలో రైతులు సన్నద్ధమవుతున్నారు. కొన్ని మండలాల్లో పొలాల్లోకి పుష్కలంగా వర్షపు నీరు చేరడంతో నాట్లు వేసుకొనేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

దేవీనగర్‌లో నేలకొరిగిన నాలుగు విద్యుత్ స్తంభాలు

కొత్తూరు, జూలై 20: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అన కాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ దేవీనగర్‌లో నాలుగు విద్యు త్ స్తంభాలు, కొబ్బరి చెట్టు నేలకొరిగాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పక్కనే ఉన్న స్తంభాలపై కొబ్బరి చెట్టు పడిపోవడంతో వైర్లతో సహా నాలుగు స్తంభాలు నేలకొరిగాయి. అయితే అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ కారణంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల సరఫరాకు అంతరాయం వాటిల్లిందని ఏపీఈపీడీసీఎల్ ఏఈ ప్రకాశ్ తెలిపారు. వెంటనే సిబ్బంది అప్రమత్తమై స్తంభాలను సరిచేసి సరఫరాలను పునరుద్ధరించారు.



కరెంటు వైర్లపై పడిన కొబ్బరిచెట్టు

భోగాపురంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల వివరాలపై ఆరా

అచ్యుతాపురం, జూలై 20: మండలంలోని భోగాపురాన్ని డీఎంహెచ్‌లో డాక్టర్ బాలాజీ శనివారం సందర్శించారు. చాలా మంది గ్రామంలో మూత్ర పిండాలు, కీళ్ల నొప్పుల వ్యాధులతో బాధపడుతుండడంతో అక్కడి పరిస్థితులను 'అయ్యో పాపం భోగాపురం' శీర్షికతో శనివారం 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. దీనిపై వెనువెంటనే స్పందించిన ఆయన సదరు గ్రామంలో పర్యటించారు. ముందుగా గ్రామ సచివాలయానికి వెళ్లి ఎంత మంది వ్యాధిగ్రస్తులు ఉన్నారు, తాగు నీరు ఎక్కడ నుంచి వస్తోంది తదితర వివరాలను గ్రామ కార్యదర్శి ద్వారా తెలుసుకున్నారు. ఇటీవల కొన్ని బోర్లలో నీటిని పరీక్షలు చేయగా, ఒక బోరు బావిలో ఫ్లోరైడ్ అధికంగా ఉన్నట్లు రిపోర్టులు వచ్చాయని వివరించారు. ఆ బోరు నీటి వినియోగాన్ని వెంటనే నిలిపి వేయాలని ఆయన ఆదేశించారు. అలాగే గ్రామంలో ఉన్న 12 బోర్లలో నీటితో పాటు ట్యాంకులో ఉన్న నీటిని విశాఖలోని రీజనల్ పబ్లిక్ హెల్త్ లేబరేటరీకి పంపాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. అనంతరం కిడ్నీ వాధితో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించారు. గ్రామంలో జనాభాకు సరిపడా ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ శ్రావ్య, సీహెచ్‌ఓ వేణుగోపాల్, జడ్పీటీసీ సభ్యుడు లాలం రాంబాబు, ధర్మిరెడ్డి నాయుడు బాబుతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు సేకరిస్తున్న డీఎంహెచ్‌ఓ బాలాజీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కార్యకర్తలకు అండగా ఉంటా

» బీజేపీ శ్రేణుల సమావేశంలో ఎంపీ సీఎం రమేష్


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేష్

కొత్తూరు, జూలై 20 : బీజేపీ కార్యకర్తలకు నిత్యం అండగా ఉంటానని ఎంపీ సీఎం రమేష్ స్పష్టం చేశారు. అనకాపల్లి పట్టణంలో శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో తన విజయానికి కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం కార్యకర్తలంతా సమష్టిగా పనిచేయాలని కోరారు. అలాగే సేవా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. పార్టీ సభ్యత్వ నమోదును ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు నూకల మధుకర్‌జీ, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, శ్రీరామ్మూర్తి, సురేంద్రమోహన్, పుట్టా గంగయ్య, పొన్నగంటి అప్పారావు, వర్మ, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో ఎమ్మెల్యే కొణతాల విస్తృత పర్యటన


రావు గోపాలరావు కళా క్షేత్రాన్ని పరిశీలిస్తున్న కొణతాల

అనకాపల్లి టౌన్, జూలై 20 : పట్టణంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ శనివారం విస్తృతంగా పర్యటించారు. ముందుగా రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. ఆగస్టు చివరి వారంలో రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు జరగనున్న నేపథ్యంలో పనులు వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం రావుగోపాలరావు కళాక్షేత్రాన్ని తనిఖీ చేశారు. అధికారులతో మాట్లాడి తక్షణమే కళాక్షేత్రానికి మరమ్మతులు చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద, నాయకులు ఆళ్ల రామచంద్రరావు, పీలా నాగ శ్రీను, మళ్ల సురేంద్ర, దూలం గోపీ, వాకాడ బాబు, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గుమ్మాల వెంకటరమణ పాల్గొన్నారు.

'సబ్బవరం'లో ప్రభుత్వ భూములు భారీగా కబ్జా

» వివరాలు అందజేయండి » విక్రయాలు జరిగిన వాటి రికార్డులు సంపాదించండి
» అక్రమ నిర్మాణాలకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వొద్దు » గంజాయి రవాణా కట్టడి చేయాలి
» మండల సమావేశంలో అధికారులకు ఎమ్మెల్యే 'పంచకర్ల' ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల

సబ్బవరం, జూలై 20 : రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి జరగాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతను శనివారం ఇక్కడ ఏర్పాటైన సబ్బవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. సమష్టి కృషితోనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఈ సందర్భంగా నారపాడు సర్పంచ్ మామిడి శంకరరావు, గొల్లలపాలెం సర్పంచ్ మోపాడ అప్పారావు తదితరులు మాట్లాడుతూ భూ ఆక్రమణల అంశాన్ని సభ దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ భూములు భారీగా కబ్జాకు గురయ్యాయని, అటువంటి వాటి భూముల వివరాలను తనకు అందజేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలు తొలగించాలని సూచించారు. అలాగే విక్రయాలు జరిగిన ప్రభుత్వ భూముల డాక్యుమెంట్లు సేకరించాలన్నారు. అక్రమ కట్టడాలకు విద్యుత్ మీటర్లు ఇవ్వ వద్దని ఆశాఖ అధికారులకు ఆదేశించారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇకపై ఎటువంటి తవ్వకాలు జరిగినా మైనింగ్, రెవెన్యూ శాఖలదే బాధ్యతని స్పష్టం చేశారు. జగనన్న కాలనీల్లో జరిగిన అవకతవకలను వెలుగులోకి తీసుకురావాలని, వాటిపై సమగ్ర నివేదికను తనకు అందజేయాలని ఎమ్మెల్యే సూచించారు. గంజాయి రవాణకు అడ్డుకట్ట వేయాలని సీఐ పిన్నింటి రమణకు సూచించారు. అనంతరం శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. వైద్యశాఖలో ఖాళీల వివరాలు తనకు అందజేయాలని సూచించారు. పలువు సభ్యులు సమస్యలను వివరించడంతో పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో డి.రామ్మోహనరావు, ఏవో షేక్ బాబూరావు, వైస్ ఎంపీపీలు ఝాన్సీలక్ష్మీరాణి, చొక్కాకుల గోవింద, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

జలమయం



పరవాడ మండలం స్వయంభూవరంలో చెరువును తలపిస్తున్న పొలాలు

» అల్పపీడనం కారణంగా రెండు రోజులు వర్షాలు
» లోతట్టు ప్రాంతాల్లోఎక్కడికక్కడ నిలిచిన నీరు
» పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు,
» 'వరహా' ఉధృతితో కోటవురట్ల మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు బంద్
» పలు చోట్ల నీట మునిగిన పంట పొలాలు


కోటవురట్ల మండలం యండపల్లిలో నీట మునిగిన నువ్వు చేను

కోటవురట్ల, జూలై 20 : మండలంలో రెండు రోజుల పాటు కురిసిన వర్షాలతో సర్పా, వరహా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మొన్నటి వరకు వెలవెలబోయిన వాగులు, చెరువులు జలకళను సంతరించుకున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు మండలంలో 42.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వరహా నది ఉధృత ప్రవాహం కారణంగా పందూరు, ముడలోవ, బంధ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దుగ్గాడ కాలువ ఉధృతంగా ప్రవహిస్తుంది. యండపల్లి, లింగాపురం, జల్లూరు గ్రామాల్లో వేసిన వరినారు, నువ్వుచేలు, కూరగాయలు పంటలలు నీటమునిగాయి. దీంతో ఆయా రైతులు ఆందోళన చెందుతున్నారు.

పరవాడ: అల్పపీడనం కారణంగా మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పరవాడ పెద్ద చెరువు, పైడంబంద చెరువులు వర్షపునీటితో నిండిపోయాయి. కలపాక పంచాయతీ పరిధి స్వయంభూవరంలో పొలాలన్నీ వర్షపునీటితో నిండిపోయి చెరువుల్లా మారాయి. పరవాడ మల్లోడిగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. వర్షం కారణంగా పలు గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయి. దీంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తుమ్మపాల : భారీ వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను వ్యవసాయాధికారులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి పి.రంగాచారి మాట్లాడుతూ ఆకుమడులను వేసిన రైతులు తమ మడుల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీరు తగ్గిన తర్వాత నాలుగు సెంట్ల నారుమడికి కేజీ పొటాషియం, కేజీ యూరియా కలిపి చల్లుకోవాలన్నారు. నారుమళ్లు పూర్తిగా దెబ్బతింటే వరిదుంప నారుమళ్లు వేసుకోవాలని సూచించారు. అలాగే నారుమళ్లకు తెగుళ్లు సోకినట్లయితే లీటరు నీటికి రెండు గ్రాముల కార్బండిజమ్ స్ప్రే చేయాలని సూచించారు. వ్యవసాయాధికారులు పి. రామకృష్ణ, రైతు సంఘం అధ్యక్షుడు పీలా బుజ్జి, కార్యదర్శి కొణతాల నాగేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

కశింకోట : భారీ వర్షాల కారణంగా నీటమునిగిన వరి నారుమడులను మండల వ్యవసాయాధికారిణి స్వప్న శనివారం సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వెదురుపర్తి గ్రామంలో ఉన్న నర్సరీలను పరిశీలించి ఇనుము లోపాన్ని గుర్తించి, తగు సూచనలు చేశారు.


తుమ్మపాలలో నీట మునిగిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు


వేటకు వెళ్లక పోవడంతో అచ్యుతాపురం మండలం పూడిమడక తీరంలో నిలిచిన పడవలు

మూడు రోజులుగా చేపల వేట బంద్

అచ్యుతాపురం : అల్పపీడనం ప్రభావం కారణంగా గత మూడు రోజులుగా పూడిమడక గ్రామానికి చెందిన మత్స్యకారులు చేపల వేటకు వెళ్లడం లేదు. గురువారం సాయంత్రం నుంచి శనివారం సాయంత్రం వరకు అడపా దడపా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. దీంతో సముద్రం అల్లకల్లోలంగా మారింది. పరిస్థితులను గుర్తించిన మత్స్యకారులు తమ పడవలు, వలలను తీరానిక దూరంగా సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

నక్కపల్లి : వర్షాల కారణంగా చినతీనార్ల, చిన దొడ్డిగల్లు గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం కలిగింది. శుక్రవారం ఈ రెండు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడంతో వాటి స్థానంలో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి, సరఫరాను పునరుద్ధరించారు. ఏఈ కృష్ణ పర్యవేక్షణలో ఈ పనులను చేపట్టారు.

జగన్‌మోహన్‌రెడ్డివి శవ రాజకీయాలు : బుద్ద


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బుద్ద

తుమ్మపాల, జూలై 20: మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శవ రాజకీయాలు మానుకోవాలని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు సూచించారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. హత్యా రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ జగన్ రెడ్డి అని ఆరోపించారు. గత ఐదేళ్ల పాలనలో శవ రాజకీయాలు చేయడం తప్ప రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను జగన్‌రెడ్డి పట్టించుకోలేదని ఎద్దేవా చేశారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో హింసలు జరిగినప్పుడు మాట్లాడలేని ఆయన నేడు నీతి వాక్యాలు చెపుతతుండడం హాస్యాస్పదంగా ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వేగి వెంకటరావు, బొడ్డేడ మురళీ, మళ్ల గణేష్, వెంకటలక్ష్మి, పెదపాటి కళ్యాణి, కాండ్రేగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ వీవీపీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అడ్‌హాక్ కమిటీ

అనకాపల్లి టౌన్, జూలై 20 : ఏపీ వైద్య విధాన పరిషత్ ఎంప్లాయీస్ అసో సియేషన్ ఉమ్మడి విశాఖజిల్లా అడ్‌హాక్ కమిటీ శనివారం ఏర్పాటైంది. అసోసియేషన్ రాష్ట్ర అడహాక్ కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడుగా ఎన్నికైన ఎంఎస్ శంకరరావు తెలిపిన వివరాలివి.ఉమ్మడి విశాఖ జిల్లా అడహాక్ కమిటీ అధ్యక్షునిగా బి.వంశీ (అగనంపూడి), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా డి.రజనీ (పాడేరు), గౌరవాధ్యక్షుడిగా ఎన్. నాదకిశోర్ (అరకు వేలీ), ఉపాధ్యక్షులుగా డి.లిల్లీగ్రేస్ (పెందుర్తి), టి.పూనమ్ జ్యోతి (అనకాపల్లి), ప్రధాన కార్యదర్శిగా కేవీఎస్‌బీ చంద్రశేఖర్ (చింతపల్లి), ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.అప్పారావు (నర్సీపట్నం), జాయింట్ సెక్రటరీలుగా బి.ఉమాదేవి (అరకు వేలీ), ఆర్ఎల్ఎన్ జానకిరావు (కోటవురట్ల), కోశాధికారిగా పీఎస్ఈ రాజు (విశాఖపట్నం) ఎన్నికయ్యారు. ఈసీ మెంబర్లుగా బి.రాణమ్మ (భీమిలి), సయ్యద్ ఇమామ్ (నక్కపల్లి), ఎ.రామలక్ష్మి (గోపాలపట్నం), డి.కిరణ్‌కుమార్ (వి.మాడుగుల), బి.సురేష్‌కుమార్ (కె.కోటపాడు), నవీన్‌కుమార్ (ఎలమంచిలి), ఎం.భాను (అనకాపల్లి), పైడిరాజు (ముంచంగిపుట్టు) నియామకమయ్యారు.

విద్యార్థులకు వేడి నీళ్లు

» హెచ్‌ఎంలకు డిప్యూటీ డీఈవో అప్పారావు సూచన

ఎస్.రాయవరం, జూలై20: వాతావరణంలో మార్పుల నేపథ్యంలో విద్యార్థులు తాగేందుకు సాధ్యమైనంత వరకు పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు వేడినీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలని డిప్యూటీ డీఈవో పొన్నాడ అప్పారావు సూచించారు. మండలంలోని ధర్మవరం అగ్రహారం జడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజన్ వ్యాధులు సోకకుండా ఉండేందుకు విద్యార్థులంతా కాచి వడబోసిన నీటినే తాగాలన్నారు. అంతకుముందు ఆయన పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు గారా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా .. తప్పిన ప్రమాదం

లంకెలపాలెం, జూలై 20 : ఇక్కడి ఫార్మాసిటీ రహదారిలో శనివారం ఓ లారీ అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. ఇందుకు సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలివి. అచ్యుతాపురం ఎస్ఈజెడ్ నుంచి నగరానికి వస్తున్న లారీ ఫార్మాసిటీకి సమీపంలోని ఓ పరిశ్రమ వద్దకు వచ్చేసరికి రహదారిపై పడిన పెద్ద గోతులో పడింది. దీంతో ఒక్కసారిగా అదుపు తప్పి పక్కకు దూసుకుపోయి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో ఆ సమయంలో అటుగా వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లైంది.

శ్రీవారి ఆలయంలో విశేష అభిషేకాలు


ఉత్సవమూర్తులకు అభిషేకం చేస్తున్న అర్చకులు

అనకాపల్లి టౌన్, జూలై 20 : దేమునిగుమ్మంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా నాలుగో రోజు శుక్రవారం విశేష అభిషేకాలతో పాటు హోమాన్ని జరిపారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పర్యవేక్షకులు సకల గోవిందరావు, జనసేన నాయకులు పీలా నాగశ్రీను, దూలం గోపీ, భీమరశెట్టి చిన్ని, గోలి మురళీ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దత్తాత్రేయ యజ్ఞం


దత్తాత్రేయుని దర్శించుకున్న కొణతాల, పీలా గోవింద

అనకాపల్లి టౌన్, జూలై 20 : గాంధీనగరంలోని రామాలయంలో దత్తాత్రేయునికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా దత్తాత్రేయ యజ్ఞం జరిపారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ స్వామివారిని దర్శించుకున్నారు. కూటమి నాయకులు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, ఆళ్ల రామచంద్రరావు, పోలారపు త్రినాథ్, మళ్ల సురేంద్ర, పీలా నాగ శ్రీను, ఎస్.భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు

అనకాపల్లి టౌన్, జూలై 20 : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాత ప్రతిష్ఠ శతజయంత్యుత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహంతో పురవీధుల గుండా నగర సంకీర్తన జరిపారు. రేజేటి రామాచార్యులు ఆధ్వర్యంలో గోపూజ ప్రదక్షిణలు చేపట్టారు. అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు చేశారు. శతజయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో-చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషకుమార్, ఆలయ కమిటీ అధ్యక్షులు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీదరాల సోమరాజు, వుప్పల శ్రీనివాసరావుతో పాటు అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు యానాద్రి అమ్మవారి జాతర



ఎలమంచిలి, జూలై 20 : మునిసిపాలిటీ పరిధి అల్లూరి సీతారామరాజు వార్డులో ఆదివారం యానాద్రి అమ్మవారి జాతర జరగనుంది. ఇందుకు సంబంధించి రైల్వే ట్రాక్ వద్దగల ఈ ఆలయంలో నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై పసుపు కుంకుమలను సమర్పించనున్నారు.

'ఏఎంఏఎల్'లో నాక్ బృందం పర్యటన


నాక్ ప్రతినిధులకు నివేదిక అందజేస్తున్న యాజమాన్యం

కొత్తూరు, జూలై 20 : ఇక్కడి ఏఎంఏఎల్ కళాశాలలో నాక్ గుర్తింపు బృందం పర్యటన ముగిసింది. గురు, శుక్రవారాల్లో ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారని, కళాశాల పూర్వ విద్యార్థులు, స్టాఫ్‌తో సమావేశమయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలను సుందరంగా తీర్చిదిద్దిన యాజమాన్యానికి, వర్తక సంఘం ప్రముఖులకు, నక్కపల్లి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివయ్యక ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వరి నారుమళ్ల సస్యరక్షణపై అవగాహన

నక్కపల్లి, జూలై 20 : మండలంలోని దేవవరం, డొంకాడ, గుల్లిపాడు, మనబాలవానిపాలెం గ్రామాల్లోని వరి నారుమళ్లలో సస్యరక్షణ చర్యలపై ఏవో ఉమా ప్రసాద్ ఆధ్వర్యంలో రైతులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ వర్షాలు వరి నారుమడులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ప్రస్తుత వాతావరణంలో పొడతెగులు ఆశించే అవకాశం ఉందని, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు ఏఈవో సత్యనారాయణ, రాజు, నాయుడు, రాకేశ్, సాయి కుమారి పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డుల కోసం వినతి

నక్కపల్లి, జూలై 20 : కౌలు రైతులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు ఆధ్వర్యంలో శనివారం డీఎల్‌పురం, వేంపాడు సచివాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. సీఐటీయు మండల కన్వీనర్ ఎం.రాజేశ్, నవీన్, శ్రీనివాసరావు, బాబ్జీ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అరవై మందికి వైద్య సేవలు

రాంబిల్లి, జూలై 20 : కృష్ణంపాలెంలో రాంబిల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం ఏర్పాటైంది. వైద్యాధికారి డాక్టర్ అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది అరవై మంది రోగులకు పరీక్షలు జరిపి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గాంధీనగరంలోని ఇంట్లో అగ్ని ప్రమాదం

అనకాపల్లి టౌన్, జూలై 20 : గాంధీనగరం ఒకటో వీధిలో గల ఓ ఇంట్లో శనివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. రూ.రెండు లక్షలు ఆస్తినష్టం జరిగినట్టు అగ్నిమాపక శాఖ అధికారి నరసింగరావు తెలిపారు. ప్రైవేటు విద్యాసంస్థలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వీకేవీ ప్రసాద్ ఇంట్లో ఉదయం వంట చేస్తున్న సమయంలో సిలెండర్ నుంచి గ్యాస్ లీకై మంటలు పూర్తిగా వ్యాపించాయన్నారు. ఈ కారణంగా గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమైనట్టు చెప్పారు.

పారిశుధ్య నిర్వహణకు స్పెషల్ డ్రైవ్

పరవాడ, జూలై 20 : మండల వ్యాప్తంగా పారిశుధ్య నిర్వహణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు పంచాయతీ విస్తరణాధికారి కె.రమేష్‌నాయుడు శనివారం తెలిపారు. ఎప్పటికప్పుడు చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు కాలువలను శుభ్రం చేయిస్తున్నామన్నారు. విధి నిర్వహణలో కార్యదర్శులు అలసత్వం చూపవద్దని సూచించారు.

'వైసీపీ నాయకుల నుంచి రక్షణ కల్పించాలి'

కశింకోట, జూలై 20 : వైసీపీ నాయకుల నుంచి రక్షణ కల్పించాలని కశింకోట ఇందిరా కాలనీకి చెందిన దొమ్మేసి సత్యారావు కుటుంబ సభ్యులు కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు రేబాక మధుబాబు, ఎన్‌హెచ్ఆర్‌పీఎఫ్ సభ్యుడు కోరిబిల్లి పరిలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనకాపల్లి మండలం బీఆర్టీ కాలనీలో 1954లో ప్రభుత్వం తమకు భూమిని కేటాయించిందన్నారు. అయితే గత వైసీపీ పాలనలో కశింకోట మండలానికి చెందిన ప్రముఖ నాయకుడు దౌర్జన్యంగా తన అనుచరుల ద్వారా సదరు భూమిని లాక్కొనే ప్రయత్నం చేశారన్నారు. ఈ అంశంపై విచారణ చేపట్టి అండగా నిలవాలని కోరారు.

సాగు భూమి సర్వేకు ఆందోళన

పాయకరావుపేట, 20 : మండలంలోని రాజవరంలో తమ సాగులో ఉన్న సర్వే నెంబరు 146లో భూమిని సర్వే చేసి సదరు నివేదికను త్వరితగతిన ఇవ్వాలని ఆ గ్రామ రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట వారు ఆందోళన చేపట్టారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ సూర్యనారాయణ మాట్లాడుతూ త్వరలో సర్వే నివేదిక అందజేస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గోసల భూలోక, కె.శ్రీరామ్మూర్తి, తుమ్మల జగన్నాథం, గోసల బండిరావు, ఎరిపిల్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై వినతి

ఎలమంచిలి, జూలై 20 : రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ అప్పలరాజుకు శనివారం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు వినతి పత్రాన్ని అందజేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో రైతులకు వ్యవసాయ పెట్టుబడులకు ప్రభుత్వం సహాయం అందించేలా చూడాలని కోరారు. రైతులకు రుణ మాఫీ చేయాలని, కేరళ తరహాలో రైతు రుణ విమోచన చట్టం చేయాలని, వ్యవసాయ మోటార్ల ఏర్పాటుకు సంబంధించిన జీవోను రద్దు చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ సీహెచ్.శివాజీ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో బ్రహ్మకమల వికాసం



ఎలమంచిలి, జూలై 20 : పట్టణంలోని శేషుగెడ్డ సమీపంలోని శివాలయం వీధిలో గల ఓ ఇంటి ఆవరణలో బ్రహ్మకమల పుష్పం వికసించింది. భీమరశెట్టి కేశవరావు ఇంటి ఆవరణలో శుక్రవారం రాత్రి పూసిన ఈ పుష్పాన్ని అంతా ఆసక్తిగా తిలకించారు.

చోడవరం, మాడుగుల ప్రాంతంలో పారిశ్రామిక క్లస్టర్

... 5వ పేజీ తరువాయి

చర్చించనున్నట్టు చెప్పారు. అనకాపల్లిలో చెత్త డంపింగ్ యార్డును వేరొక ప్రాంతానికి మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

జిల్లాలో 1,500 గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్‌లు

జిల్లాలో అన్నిగ్రామాలకు సురక్షితమైన తాగునీరు అందించాలన్న లక్ష్యంతో ఎంపీ గ్రాంట్ మంజూరు కాగానే 1,500 గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని ఎంపీ సీఎం రమేశ్ తెలిపారు. అలాగే గెయిల్, ఎన్‌టీపీసీ, ఇండుజా కంపెనీల నుంచి సీఎస్ఆర్ నిధులను ఖర్చు చేసి అన్ని గ్రామాల్లో మినరల్ వాటర్‌ప్లాంట్‌లు మంజూరు చేస్తామన్నారు. స్థానిక టీడీపీ, బీజేపీ, జనసేన నాయకుల నుంచి మినరల్ వాటర్ ప్లాంట్‌ల మంజూరుకు ప్రతిపాదనలు తీసుకుంటామన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర మోహన్, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు, ఎలమంచిలి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న బీఎన్ రోడ్డు

- రహదారిపై పెద్ద గోతుల్లో చేరిన వర్షం నీరు
- నరకప్రాయంగా ప్రయాణం
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు



హీరో షోరూమ్ ఎదురుగా చెరువును తలపిస్తున్న రహదారి



గర్నికం మేదర కాలనీ సమీపంలో పరిస్థితి...

రావికమతం, జూలై 20: చినుకు పడితే చాలు బీఎన్ రోడ్డు పొడుగునా గోతుల్లో నీరు చేరి చెరువుల్లా తలపిస్తున్నాయి. గత రెండు రోజులుగా ఏకధాటిగా కురిసిన వర్షాలకు ఈ రహదారి మరీ అధ్వానంగా తయారైంది. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. చోడవరం మండలం వెంకన్నపాలెం నుంచి రోలుగుంట మండలం వెలంకాయలపాలెం వరకూ సుమారు 50 కిలోమీటర్ల మేర ఈ రోడ్డు ఉంది. ఈ రోడ్డు మరమ్మతుకు వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.79.89 కోట్లు మంజూరైనా నిధులు విడుదల కాలేదు. దీంతో పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ బిల్లులు రాక అసంపూర్తిగా వదిలేశారు.

మండల పరిధిలో టి.అర్జాపురం నుంచి పొన్నవోలు వరకూ కొంతమేర మరమ్మతు చేశారు. మిగిలినది వదిలేయడంతో రావికమతం వే బ్రిడ్జి నుంచి మేడివాడ పెద్ద చెరువు వరకూ రోడ్డు పొడుగునా అడుగడుగునా భారీ గొయ్యిలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డులో ప్రయాణమంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. ఓ మోస్తరు వర్షం వచ్చినా ఈ పెద్ద గోతుల్లో నీరు చేరి చెరువుల్లా పరిస్థితి అధ్వానంగా మారుతోంది. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్న సంఘటనలు ఉంటున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు ఈ రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ఆదేశించినా అధికారులు పట్టించుకోలేదు.

ఇప్పుడు రోడ్డుపై గోతులు మరింత పెద్దగా మారడంతో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేసి ప్రమాదభరితంగా మారాయి. మరమ్మతులు చేయడంతో రావికమతం మధ్యలో మాత్రం కాస్త బాగా ఉన్నా హీరో షోరూమ్ వద్ద మరీ దారుణంగా ఉంది. గర్నికం మేదర కాలనీ వినాయకుడి గుడి, ఆర్లె వారి ఇళ్లు, బాల చెంచమ్మ ఆర్చి సమీపం, మేడివాడ ఆంజనేయస్వామి గుడి సమీపం, పాల కేంద్రం వద్ద రోడ్డుపై చెరువుల మాదిరిగా పరిస్థితి ఉంది. ఈ రోడ్డులో ప్రయాణం నరకప్రాయమంటూ వాహనదారులు వాపోతున్నారు. ఈ భారీ గోతులు పూడ్చి సురక్షితంగా రాకపోకలకు వీలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



రావికమతం : వరద నీటితో కళకళలాడుతున్న దాసరియ్యపాలెం కన్నుల చెరువు



నర్సీపట్నం : పెద్దచెరువు పొర్లుకట్టు నుంచి పొంగిపొర్లుతున్న నీరు

చెరువుల్లో జలకళ

- భారీ వర్షాలతో నిండిన జలశయాలు
- రైతుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం

రావికమతం, జూలై 20 : మండలంలో 92 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో కల్యాణపులోవకు వరద పోటు అధికమై చెరువులో నీటి మట్టం పెరగడంతో గత రెండు రోజులుగా రెండు గేట్లు ఎత్తారు. కురుస్తున్న వర్షాలకు కొండ గెడ్డల ద్వారా గుమ్మాళ్ళపాడు పారమ్మ చెరువు, దొండపూడి పెద్ద చెరువు, మత్స్యపురం ఎర్ర చెరువు, దాసరియ్యపాలెం కన్నుల చెరువు, గదబపాలెం తదితర పలు చెరువులు కళకళలాడుతున్నాయి.ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు దమ్ములు, వరినాట్లు సకాలంలోనే జరిగే అవకాశం ఉందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నర్సీపట్నంలో..

నర్సీపట్నం : నర్సీపట్నంలో మోస్తారు వర్షం కురిసింది. శనివారం తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటలు వరకు వర్షం పడటంతో రోడ్లు జలమయం అయ్యాయి. పెదబొడ్డేపల్లిలో చెరువు నిండిపోయి వరద నీరు మెయిన్ రోడ్డు మీదకు చేరింది. నర్సీపట్నం శివపురంలో పంట కాలువ నీరు రోడ్డు మీద ప్రవహించింది. పెద్ద చెరువు నిండి పోయి పొర్లుకట్టు నుంచి నీరు పొంగిపొర్లింది.

సంక్షిప్తంగా..

పాఠశాలలోకి వర్షపు నీరు



వర్షం నీరు చేరిన తాడపాల ప్రాథమికోన్నత పాఠశాల

మాకవరపాలెం, జూలై 20 : మండలంలో గత మూడు రోజులు నుంచి కురుస్తున్న వర్షాలకు తాడపాల ప్రాథమికోన్నత పాఠశాల పూర్తిగా జలమైంది. ఈ పాఠశాల శిథిలావస్థకు చేరడంతో ప్రస్తుతం కురిసిన వర్షాలకు పై కప్పు నుంచి వర్షను నీరు చేరి తరగతి గదుల్లో చేరుతోంది. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు మరింత వర్షం చేరడంతో టేబుళ్లు, బల్లలు, ఇతర సామగ్రి తడిచిపోయాయి. ఇప్పటికైనా పాఠశాల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

22న ఆర్లి దేవస్థానం భూములకు వేలం

కె.కోటపాడు, జూలై 20 : మండలంలోని ఆర్లి గ్రామంలో నెలకొనియున్న శ్రీమల్లికార్జున స్వామి దేవాలయం భూములకు ఈ నెల 22న ఉదయం 10 గంటలకు దేవస్థానం ఆవరణలో వేలం నిర్వహిస్తున్నట్లు దేవదాయశాఖ కార్యనిర్వహణ అధికారి శర్మ తెలిపారు. స్వయంభు దేవాలయానికి సంబంధించి 11 ఎకరాల భూమి కౌలుకు ఈ వేలం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఔత్సాహికులు అందరూ వేలం పాటలో పాల్గొనాలని శర్మ కోరారు.

సభ్యత్వ నమోదు విజయవంతం చేయండి

రోలుగుంట, జూలై 20 : జనసేన పార్టీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బలిజి మహారాజు పిలుపు ఇచ్చారు. మండలంలోని 24 పంచాయతీల్లో సభ్యత్వ నమోదు చేపడుతున్నట్టు చెప్పారు. జనసేన పార్టీ బలోపేతం అయ్యేందుకు క్రియాశీలక సభ్యత్వ నమోదు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఏ పార్టీలో లేని విధంగా రూ.5 లక్షల బీమా, 50 వేల మెడికల్ బీమాను జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వంతో అందిస్తోందన్నారు.

2న రైవాడ నీరు విడుదల : ఎమ్మెల్యే బండారు



రైతులు, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

దేవరాపల్లి, జూలై 20 : రైవాడ నీటిని రైతుల కోరిక మేరకు ఆగస్టు 2న ఆయకట్టుకు విడుదల చేయనున్నట్టు ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తి వెల్లడించారు. నీరు విడుదలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని డీఈఈ సత్యంనాయుడును ఆదేశించారు. రైతు ప్రతినిధులతో శనివారం ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు నీటిని విడుదల చేస్తామన్నారు. అలాగే పెద్దేరు జలాశయంలో నీటిని ఈనెల 28న విడుదల చేస్తామని తెలిపారు. అనంతరం డీఈఈ సత్యంనాయుడుతో ఆయన మాట్లాడుతూ జైకా నిధులతో చేపట్టి అసంపూర్తిగా నిలిచిపోయిన ఆధునీకరణ పనులను పునర్ ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీరు విడుదల అయ్యేలోగా పంట కాలువల్లో పెరిగిన తుప్పలను ఉపాధి హామీ పథకంలో భాగంగా తొలగించాలన్నారు. అనంతరం మారేపల్లి వేంకటేశ్వరస్వామి గిరి ప్రదక్షిణలో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, మండల పార్టీ అధ్యక్షుడు సూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పాత్రునాయుడు, కోటిపల్లి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గౌరీపట్నంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు

తాచేరు డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోవడంతో అవస్థలు



గౌరీపట్నం-చోడవరం మార్గంలో నిలిచిపోయిన వాహనాలు

చోడవరం, జూలై 20 : భారీ వర్షాలకు చోడవరం పాడేరు రోడ్డులో విజయరామరాజుపేట వద్ద తాచేరు డైవర్షన్ రోడ్డు కొట్టుకునిపోవడంతో మండలంలోని గౌరీపట్నం మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయంఏర్పడింది. చోడవరం, వడ్డాది రూట్లో వాహనాల రాకపోకలు నిలిపివేయడంతో వాహనాలన్నీ వడ్డాది మీదుగా గౌరీపట్నం నుంచి చోడవరం వైపుగా మళ్లించారు.

అయితే గౌరీపట్నం ఇరుకు రహదారి కావడం.. ఆటోలు, వ్యాన్లు, కార్లు అన్నీ ఒకేసారి రావడంతో గౌరీపట్నంలోని వీధుల్లో సుమారు 3 గంటలకు పైగా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ప్రధాన రహదారిలోని ట్రాఫిక్‌పైనే దృష్టి సారించడంతో గౌరీపట్నంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే నాథుడే లే కుండాపోయాడు. దీంతో వాహనదారులు గంటల తరబడి గౌరీపట్నం మార్గంలో చిక్కుకొని ఇబ్బందులు పడ్డారు. తాచేరు కాజ్‌వేపై రాకపోకలు పునరుద్ధరించే వరకూ గౌరీపట్నంలోని వాహనాల రాకపోకల నియంత్రణకు పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రహరీ గోడ కూలడంతో ప్రమాదకర స్థితిలో ఇల్లు



గొలుగొండ, జూలై 20 : మండలంలోని పలు గ్రామాల్లో అల్పపీడనం కారణంగా మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఇంటి ప్రహరీ శిథిలమైంది. శుక్రవారం రాత్రి రావణాపల్లి గ్రామంలో దేవర అప్పలనాయుడుకు చెందిన ప్రహరీ శిథిలమైంది. దీంతో రెవెన్యూ వీఆర్‌వో కుమారి శిథిలమైన గోడను పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తున్నట్లు తెలిపారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి : డీపీవో



చినబజారువీధిలో పనులు పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

చోడవరం, జూలై 20 : వర్షాకాలం నేపథ్యంలో సీజనల్, అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీల సిబ్బందికి జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి ఆదేశించారు. శనివారం పట్టణంలోని చీడికాడ రోడ్డులోని నరసరాజు చెరువు, నూకాలమ్మ గుడి ప్రాంతం, బాలాజీనగర్, చినబజారు ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. పంచాయతీ అధికారులకు పారిశుధ్య నిర్వహణపై సూచనలు చేశారు. రహదారుల పక్కన తుప్పలు తొలగించాలని, నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. ప్రజలకు తాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్‌సీ కన్వీనర్ నాగలక్ష్మి, ఈవోపీఆర్డీ బి.చైతన్య, పంచాయతీ ఈవో నారాయణరావు, వార్డు సభ్యులు తానవరపు శ్రీను, చిన్నారావు, ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, కార్తీక్‌వర్మ, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెరుగ్గా వైద్య సేవలు అందించాలి

మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

కె.కోటపాడు, జూలై 20 : దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు అసౌకర్యం కలిగించకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి వైద్యులను ఆదేశించారు. శనివారం స్థానిక 50 పడకల వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. రోగులతో మాట్లాడి అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో ప్రసవాలు ఎక్కువగా జరుగుతుండడం మంచి పరిణామం అన్నారు. ఆసుపత్రిలో అన్ని విభాగాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వైద్యులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య సేవలు అందించే విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వద్దన్నారు. ఆస్పత్రికి అవసరమైన నిధులు, సిబ్బందిని తెప్పించే బాధ్యత తనదన్నారు. ఈ సమావేశంలో ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ శ్రీలక్ష్మి, వైద్యులు నందకిషోర్, సునీల్, కోటేశ్వరరావు, వైదేహి, రమ, సుమన్ లత పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు రొంగలి మహేష్, కె.కోటపాడు మాజీ సర్పంచ్ డోకల నరసింహమూర్తి, ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల అధ్యక్షుడు దాడి ఎరుకునాయుడు, సర్పంచ్ పూడి నారాయణమూర్తి, క్లస్టర్ ఇన్‌చార్జి కన్నూరు సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ సబ్బవరపు రామునాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు బత్తి రమణ పాల్గొన్నారు.

ముగిసిన చండీ రుద్రయాగం



చండీశ్రీరుద్ర మహాయాగం నిర్వహిస్తున్న అర్చకులు

చోడవరం, జూలై 20 : పట్టణంలోని ప్రముఖ స్వయంభూ గౌరీశ్వరాలయంలో ఈ నెల 17న ప్రారంభమైన చండీశ్రీ శ్రీరుద్ర మహాయాగం శనివారం ముగిసింది. ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతి సారథ్యంలో కాకినాడకు చెందిన శ్రీపాద అవధాని, బులుసు ప్రభాకరశర్మల పర్యవేక్షణలో వేదపండితుల సహకారంతో ఈ యాగాన్ని కొనసాగిస్తున్నారు. శనివారం నిర్వహించిన యాగంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఈ రుద్రమహాయాగంలో స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుతో పాటు, స్థానిక ప్రముఖులు ధర్మతేజ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. యాగం చివరిరోజున సినీ ఆర్ట్ డైరెక్టర్ ఏఎస్ ప్రకాశ్‌తో పాటు ఇతర ప్రముఖులను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, ఇతర పెద్దలు ఘనంగా సత్కరించారు.

వరి నారుమడుల పరిశీలన



రైతులకు సూచనలు ఇస్తున్న ఏడీ శ్రీదేవి

నర్సీపట్నం, జూలై 20 : గబ్బాడలోని రైతు సేవా కేంద్రం పరిధిలోని నారుమడులను శనివారం నర్సీపట్నం వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీదేవి సందర్శించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నారు మడుల్లోకి చేరిన నీటి బయటకు తీయడానికి కాలువలు చేసుకోవాలని రైతులకు సూచించారు. రెండు మూడు రోజులు కన్నా ఎక్కువ రోజులు నారు మడులు నీటిలో ఉంటే నారు దెబ్బతినే ప్రమాదం ఉందని సూచించారు. నీరు పూర్తిగా తీసేసి వర్షం తగ్గిన తర్వాత 5 సెంట్ల నారు మడికి రెండు కిలోలు యూరియా, ఒక కిలో పొటాష్ వేసుకోవాలని సూచించారు. ప్రధాన పొలంలో నాటడానికి వారం రోజుల ముందు సెంటు నారు మడికి 150 గ్రాములు కార్బో ఫ్యూరాన్ గుళికలు వేసుకోవాలన్నారు. అలాగే సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ మందుని విత్తన శుద్ధికి, గెత్తంలో కలుపుకొని ప్రధాన పొలంలో వేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీహరి, గబ్బాడ వ్యవసాయ సహాయకులు వెంకటరమణ పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు : డీఎల్పీవో



పనులను పర్యవేక్షిస్తున్న డీఎల్పీవో మూర్తి

మాకవరపాలెం, జూలై 20 : గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శులకు డీఎల్పీవో మూర్తి ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని రాజారావుపేట వీధిలో చేపట్టిన పారిశుధ్యం పనులను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ పారిశుధ్య నిర్వహణ చేపట్టాలన్నారు. కాలువల్లో పూడికలు తొలగించడం, వీధుల్లో చెత్తాచెదారాలు తొలగించి బ్లీచింగ్ చల్లడం చేయాలన్నారు. సీజనల్ వ్యాధులకు కారణమయ్యే నీటి నిల్వలు, దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సీతామహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి బాలదొర తదితరులు పాల్గొన్నారు.

పశువులకు లంపిస్కిన్ నిరోధక టీకాలు

మాడుగుల రూరల్, జూలై 20 : మండలంలోని అన్ని గ్రామాల్లో పశువులకు లంపిస్కిన్ వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు మాడుగుల ఏరియా పశువైద్య సహాయ సంచాలకులు చిట్టినాయుడు తెలిపారు. శనివారం మాడుగులలో జరిగిన ఉచిత టీకాలు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీడికాడ మండలానికి 500 డోసులు, మాడుగుల మండలానికి 7300 డోసులు, పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు.

ఏపీ వీవీపీ ఎంప్లాయీస్ అసోసియేషన్‌కు అడహాక్ కమిటీ

అనకాపల్లి టౌన్, జూలై 20 : ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా అడహాక్ కమిటీ శనివారం ఏర్పాటైంది. అసోసియేషన్ రాష్ట్ర అడహాక్ కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడుగా ఎన్నికైన ఎంఎస్ శంకరరావు తెలిపిన వివరాలివి.ఉమ్మడి విశాఖ జిల్లా అడహాక్ కమిటీ అధ్యక్షునిగా బి.వంశీ (అగనంపూడి), అసోసియేట్ ప్రెసిడెంట్‌గాడి.రజనీ (పాడేరు), గౌరవాధ్యక్షుడిగా ఎన్. నాదకిశోర్ (అరకు వేలీ), ఉపాధ్యక్షులుగా డి.లిల్లీ గ్రేస్ (పెందుర్తి), టి.పూనమ్ జ్యోతి (అనకాపల్లి), ప్రధాన కార్యదర్శిగా కేవీఎస్‌బీ చంద్రశేఖర్ (చింతపల్లి), ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.అప్పారావు (నర్సీపట్నం), జాయింట్ సెక్రటరీలుగా బి.ఉమాదేవి (అరకు వేలీ), ఆర్‌ఎల్ఎన్ జానకిరావు (కోటవురట్ల), కోశాధికారిగా పీఎస్ఈ రాజు (విశాఖపట్నం)ఎన్నికయ్యారు. అలాగే, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా బి.రాణమ్మ (భీమిలి), సయ్యద్ ఇమామ్ (నక్కపల్లి), ఎ.రామలక్ష్మి (గోపాలపట్నం), డి.కిరణ్‌కుమార్ (వి.మాడుగుల), బి.సురేష్‌కుమార్ (కె.కోటపాడు), నవీన్‌కుమార్ (ఎలమంచిలి), ఎం.భాను (అనకాపల్లి), కె.పైడిరాజు (ముంచంగిపుట్టు) నియమితులయ్యారు.

చోడవరం, మాడుగుల ప్రాంతంలో పారిశ్రామిక క్లస్టర్

... 5వ పేజీ తరువాయి

చర్చించనున్నట్టు చెప్పారు. అనకాపల్లిలో చెత్త డంపింగ్ యార్డును వేరొక ప్రాంతానికి మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

జిల్లాలో 1,500 గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్‌లు

జిల్లాలో అన్నిగ్రామాలకు సురక్షితమైన తాగునీరు అందించాలన్న లక్ష్యంతో ఎంపీ గ్రాంట్ మంజూరు కాగానే 1,500 గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని ఎంపీ సీఎం రమేశ్ తెలిపారు. అలాగే గెయిల్, ఎన్‌టీపీసీ, ఇండుజా కంపెనీల నుంచి సీఎస్ఆర్ నిధులను ఖర్చు చేసి అన్ని గ్రామాల్లో మినరల్ వాటర్‌ప్లాంట్‌లు మంజూరు చేస్తామన్నారు. స్థానిక టీడీపీ, బీజేపీ, జనసేన నాయకుల నుంచి మినరల్ వాటర్ ప్లాంట్‌ల మంజూరుకు ప్రతిపాదనలు తీసుకుంటామన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర మోహన్, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు, ఎలమంచిలి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి



క్యాన్సర్ నిర్ధారిత పరీక్షలు చేసిన వైద్య బృందం

రావికమతం, జూలై 20 : ముప్పై సంవత్సరాలు దాటిన ప్రతి మహిళ క్యాన్సర్ నిర్ధారిత పరీక్షలు చేయించుకోవాలని అగనంపూడి హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ నమిత తెలిపారు. మండలంలోని కొట్నాబిల్లి, గుమ్మాళ్ళపాడు గ్రామాల్లో శనివారం క్యాన్సర్‌పై అవగహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సకాలంలో గుర్తిస్తే క్యాన్సర్ నియంత్రణ సాధ్యమేనన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో తాము అన్ని గ్రామాల్లో నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా 200 మంది మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారి రజిని, ఆరోగ్య విస్తరణ అధికారి పి.రామారావు, హోమీబాబా ఆస్పత్రి వైద్యాధికారి శైలజ తదితరులు పాల్గొన్నారు.

నారుమడుల్లో నీరు లేకుండా చూడాలి



పాతమల్లంపేటలో వరినారుమడులపై సూచనలు ఇస్తున్న ఎంపీఈవో సత్యవేణి

గొలుగొండ, జూలై 20 : మండలంలోని పలు గ్రామాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు పొలాల్లో సాగు చేపట్టిన వరి నారుమడులను వ్యవసాయ సిబ్బంది శనివారం పరిశీలించారు. మండలంలోని పాతమల్లంపేట, గొలుగొండ, జోగంపేట, పప్పుశెట్టిపాలెం గ్రామాల్లో ముంపునకు గురైన వరినారుమడులు పరిశీలించిన అనంతరం రైతులతో ఎంపీఈవో సత్యవేణి పలు సూచనలో అందించారు. వరినారుమడుల్లో వర్షపు నీరు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మొలకెత్తిన రెండు మూడు రోజుల నుంచి వర్షపు నీరు నిల్వలు ఉంటే వరినారుమడులు పాడవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

అప్పన్న భక్తులకు అన్న సమారాధన



అన్నసమారాధన చేస్తున్న గజపతినగరం గ్రామస్థులు

చోడవరం, జూలై 20 : సింహాచలం గిరిప్రదక్షిణ భక్తుల కోసం శనివారం మండలంలోని గజపతినగరం గ్రామస్థులు భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఏటా సింహాచలం గిరిప్రదక్షిణ సందర్భంగా గజపతినగరం వాసులంతా కలిసికట్టుగా భక్తుల కోసం అన్నసమారాధన నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కనిశెట్టి మత్స్యరాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏడువాక సత్యారావు, డీసీసీబీ సాయి,ఈశ్వరరావు, జన్నవరం నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యల గుర్తింపునకు పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

నర్సీపట్నం అర్బన్, జూలై 20 : రాష్ట్ర ఏఐఎస్ఎఫ్ నాయకుల ఆదేశాల మేరకు ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకూ నర్సీపట్నం డివిజన్‌లో విద్యార్థుల సమస్యలపై వసతి గృహాలను సందర్శిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఫణీంద్రకుమార్ తెలిపారు. నర్సీపట్నంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెలలో పది రోజుల పాటు వసతిగృహాలను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటామన్నారు. అనంతరం వచ్చే నెల 6న కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడతామన్నారు. ఇప్పటి వరకూ పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీలబకాయిలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. పలు గ్రామాల్లో వసతిగృహాలు శిథిలావస్థకు చేరాయన్నారు. వాటికి మరమ్మతులు చేపట్టాలని కోరారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

వానొచ్చె.. వరదొచ్చె.. జలాశయాలు నిండే..




రావికమతం : రెండు గేట్లు ద్వారా సర్పానదికి విడుదల చేస్తున్న అదనపు నీరు



బుచ్చెయ్యపేట : వడ్డాది కాజ్‌వేను తాకుతూ ప్రవహిస్తున్న వరద నీరు



బుచ్చెయ్యపేట : తాచేరు డైవర్షన్ రోడ్డును పరిశీలిస్తున్న డీపీఓ శిరీషారాణి



మాడుగుల రూరల్ : గరిష్ఠ స్థాయిలో పెద్దేరు జలాశయం

కాలువల్లో వ్యర్థాల తొలగింపు



వ్యర్థాలు తొలగిస్తున్న బీసీ కాలనీ వాసులు

మాకవరపాలెం, జూలై 20 : స్థానిక బీసీ కాలనీలో మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను స్థానికులు శ్రమదానం చేసి తొలగించారు. ఈ కాలనీలోని కాలువల్లో ఎన్నాళ్ల నుంచో పూడిక నిండి మురుగు నీరు పారడం లేదు. దీంతో దుర్వాసన, దోమలు విజృంభిస్తున్నాయి. అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో స్థానికులు ముందుకు వచ్చి శ్రమదానం చేశారు.